B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 261 | గురువారం | 15-10-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



దసరా తర్వాత భారీ బహిరంగ సభ

- 2 లక్షల మందితో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ
- దసరా తర్వాత నిర్వహిస్తాం
- ఓట్‌చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన
- ఎమ్మెల్సీ ఎన్నికలపై 23న సీఎం సమావేశం : టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ 2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

ఓట్ చోరీని నిరసిస్తూ దసరా తర్వాత.. హైదరాబాద్‌లో రెండు లక్షల మందితో భారీ మార్చ్, బహిరంగ సభను నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ వెల్లడించారు. దక్షిణాదిన రెండు రాష్ట్రాల్లో ఈ సభలను నిర్వహించాలని కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయించిందని, అందులో ఒకటి హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. బుధవారం, గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు పోరాటం చేసినా వారికి తమ మద్దతు ఉంటుందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు రాహుల్‌గాంధీ స్వయంగా షూ లేస్ కట్టారని గుర్తు చేస్తూ.. అంతటి ఉన్నత వ్యక్తిత్వం ఉన్న నేత మహిళా జర్నలిస్టులను అవమానించారంటూ కొందరు చవకబారు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాల కోసం మతాల మధ్య చిచ్చుపెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు.అయోధ్య రామ మందిర నిర్మాణానికి భూమి పూజ చేసిందే రాజీవ్‌గాంధీ అని స్పష్టం చేశారు.

పదే పదే చెప్పినా పరిస్థితి మారలేదు

- కరెంట్ కోతలపై రేవంత్ రెడ్డి ఉగ్రరూపం..
- అధికారులకు తీవ్ర హెచ్చరిక
- పదేపదే చెప్పినా పరిస్థితి మారలేదని అధికారులపై అసహనం
- నిర్లక్ష్యం చేస్తే స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్కో సీఎండీని సస్పెండ్ చేస్తానని హెచ్చరిక
- రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై యూకే మేయర్ల బృందంతో సీఎం చర్చలు
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ఆహ్వానం


2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

తెలంగాణలో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పనితీరుపై ఆయన నిప్పులు చెరిగారు. ఎన్నిసార్లు ఆదేశాలు ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం, అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని గట్టి హెచ్చరిక జారీ చేశారు.బుధవారం విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు



సింగరేణిని దోచుకుంటున్నారు

- కమిషన్ల కోసమే సింగరేణిని దోచుకుంటున్నారు రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
- వాటాలు తేలకపోవడం వల్లే నైని టెండర్లు రద్దు చేశారని విమర్శ
- సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరుతో రూ.10,000 కోట్ల కుంభకోణం జరిగిందన్న కేటీఆర్
- సింగరేణి అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని వెల్లడి 2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం సింగరేణి సంస్థను పంచుకొని దోచుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) ఆరోపించారు. సింగరేణిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం శ్రద్ధ లేదని, ఆయన పాలనలో సంస్థ భ్రష్టుపట్టిపోతోందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో అక్టోబర్ 14న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన ప్రసంగించారు.కమిషన్ల లెక్కలు తేలకపోవడం

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లకు తెలంగాణ బెస్ట్ డెస్టినేషన్

సీఎం రేవంత్ రెడ్డి

- ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణను ఉత్తమ గమ్యస్థానంగా మారుస్తామన్న సీఎం
- 'క్యూర్, ప్యూర్, రేర్' జోన్ల ఏర్పాటుతో సమగ్రాభివృద్ధికి ప్రణాళిక
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను నిలపడమే లక్ష్యం
- దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచడమే మా సంకల్పం రాజకీయాలు ఎన్నికలకే పరిమితం,
- అభివృద్ధిపైనే మా పూర్తి దృష్టి అని స్పష్టం చేసిన సీఎం


2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణను అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ సంకల్పమని

ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..


2

కొత్త ఆందోళనకు

అభిజీత్ దీప్కే పిలుపు

- సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం
- నిరసనకు 'లెహ్రా దో తిరంగా' పేరు
- సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాల అరెస్టుకు నిరసనగా కార్యక్రమం
- అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
- స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే పిలుపు

మన ప్రజాపక్షం,ఢిల్లీ

తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు.


2


గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌కు తరలిరండి

'రైజింగ్ తెలంగాణ' లక్ష్యసాధనలో భాగస్వాములవ్వండి
'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్-26'లో మంత్రి శ్రీధర్‌బాబు


2

దివ్యాంగులకు మరింత ఆసరా

- కనీస వయసు నిబంధన ఎత్తివేత..
- పుట్టినప్పటి నుంచే పింఛను
- అర్హత వైకల్యం 40 శాతానికి తగ్గింపు
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం



2

'సర్' గడువు మరోసారి పొడిగింపు

- 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- క్లెయిములు, అభ్యంతరాలకు 22 వరకు గడువు

'సర్'పై సుప్రీంలో ఒవైసీ పిటిషన్


2

మన ప్రజాపక్షం,ఢిల్లీ

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ నిర్వహణ తీరును సవాలు చేస్తూ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ బుధవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో రాజ్యాంగపరమైన, చట్టపరమైన రక్షణలను ఎన్నికల సంఘం విస్మరించిందని.. ఫలితంగా అర్హులైన పౌరుల ఓటు హక్కు ప్రమాదంలో పడిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒవైసీ

జిల్లాల మధ్య చిచ్చు పెట్టేలా కొందరు వ్యవహరిస్తున్నారు

గుత్తా సుఖేందర్ రెడ్డి

శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరి తీరు జిల్లాల మధ్య చిచ్చుపెట్టేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.


2

మన ప్రజాపక్షం,హైదరాబాద్

త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణలో నేడు జిల్లాల మధ్య చిచ్చుపెట్టేలా కొందరు వ్యవహరించడం బాధాకరమని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలుగుతుందని వెల్లడించారు. నల్గొండలోని క్యాంప్ కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, జల వివాదాలు, కరువు పరిస్థితులు, విద్యుత్ సమస్యలు, తదితర అంశాలపై మాట్లాడారు.

రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం సరికాదు

All are Continues Second Page

పదేపదే చెప్పినా పరిస్థితి మారలేదు

మొదటి పేజీ తరువాయి

పూర్తిస్థాయిలో లింకేజీలు ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఎందుకు జరగడం లేదని నిలదీశారు. "పదేపదే చెప్పినా మీలో చలనం రావడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ), జెన్‌కో సీఎండీ సహా ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. విద్యుత్ కోతలకు గల కారణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని, సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

యూకే మేయర్లతో సీఎం భేటీ

అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మేయర్ల ప్రతినిధి బృందం కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా హెల్త్‌కేర్, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, పరిశోధన, తయారీ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా "యూకే-ఇండియా సీఈటీఏ అండ్ రీజనల్ సినర్జీస్" అనే అంశంపై యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను సీఎం ఆవిష్కరించారు. అనంతరం, డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026"కు హాజరు కావాల్సిందిగా యూకే ప్రతినిధులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.

సింగరేణిని దోచుకుంటున్నారు

మొదటి పేజీ తరువాయి

వల్లే నైని టెండర్లను ప్రభుత్వం రద్దు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. నైని కుంభకోణాన్ని ఆపి రూ.30,000 కోట్లు ఆదా చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ పెద్దల మధ్య వాటాలు తేలనప్పుడే ఇలాంటి కుంభకోణాలు బయటకు వస్తాయని ఎద్దేవా చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధన పేరుతో సింగరేణిలో సుమారు రూ.10,000 కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. దీనితో పాటు సోలార్, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లు, మరో నాలుగైదు అంశాల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు.సింగరేణి కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్న ఈ అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని కేటీఆర్ వెల్లడించారు. ఇప్పటికే సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అధికార పార్టీ నేతలు ఒకరినొకరు కాపాడుకుంటూ, కమిషన్ల కోసం సింగరేణిని కొల్లగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలపై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

జిల్లాల మధ్య చిచ్చు పెట్టేలా కొందరు వ్యవహరిస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలను చేపట్టడం జరిగిందని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి రోజుకు 1.5 టీఎంసీల నీటిని పాలమూరు ప్రాంతానికి, 0.5 టీఎంసీల నీటిని డిండి ఎత్తిపోతల పథకానికి కేటాయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. అయితే ఈ నిర్ణయాన్ని వివాదాస్పదం చేస్తూ కొందరు మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం సరికాదని హితువు పలికారు. అనవసరమైన వివాదాలు సృష్టించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి ఆక్షేపించారు. నార్లాపూర్ నుంచి నీటిని తరలించాలంటే అదనపు ఖర్చుతో పాటు ఎక్కువ సమయం అవసరమవుతుందని, అనుమతుల సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్మాణంలో సాంకేతిక అంశాలు, ఆర్థిక భారం, సమయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రేవంత్ రెడ్డి కూడా చొరవ తీసుకోవాలి

మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రజాప్రతినిధులు పరస్పరం చర్చించుకుని, ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి ఏ జిల్లాకు ఎంత నీరు అవసరమో సామరస్య పూర్వకంగా నిర్ణయించుకోవాలని గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రేవంత్ రెడ్డి కూడా చొరవ తీసుకోవాలని కోరారు. రెండు జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని గుత్తా విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరాపై ఒత్తిడి పెరుగుతోంది

నల్గొండ జిల్లా దశాబ్దాలుగా ఫ్లోరైడ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రాంతమని గుర్తు చేశారు. ఫ్లోరైడ్ సమస్య నుంచి ప్రజలను శాశ్వతంగా కాపాడాలంటే సురక్షితమైన తాగునీటితో పాటు సాగునీటి వసతులు కూడా అందుబాటులో ఉండాలని అన్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో జలవిద్యుత్ ఉత్పత్తి కూడా తగ్గిందని, దీనివల్ల విద్యుత్ సరఫరాపై ఒత్తిడి పెరుగుతోందని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని, అందువల్ల రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గుత్తా సూచించారు.

గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లకు

తెలంగాణ బెస్ట్ డెస్టినేషన్

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉన్న తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఫెడరేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్: 2047 విజన్ డాక్యుమెంట్'ను వివరిస్తూ, రాష్ట్రాన్ని మూడు ప్రధాన జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలన్న తమ ప్రణాళికను వెల్లడించారు. "2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు 'క్యూర్ , ప్యూర్ , రేర్ ' అనే మూడు జోన్లను అభివృద్ధి చేయాలని సంకల్పించాం" అని వివరించారు.క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ): హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (లోపలి ప్రాంతాన్ని ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.ప్యూర్ (పెరీ-అర్బన్ రీజియన్ ఎకానమీ): ఓఆర్ఆర్, రీజనల్ రింగ్ రోడ్ మధ్య ఉన్న ప్రాంతంలో తయారీ పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులు, లాజిస్టిక్స్ రంగాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు.రేర్ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ): గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధిపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతాయని, ప్రధాని మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో రాష్ట్రాల సహకారం కీలకమని రేవంత్ రెడ్డి అన్నారు. "మా ప్రధాన దృష్టి అభివృద్ధిపైనే ఉంది. రాజకీయాలు కేవలం ఎన్నికలకే పరిమితం కావాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.చార్మినార్ నుంచి హైటెక్ సిటీ వరకు హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరంగా ఎలా రూపాంతరం చెందిందో గుర్తుచేశారు. పెట్టుబడిదారులకు స్నేహపూర్వక విధానాలతో పూర్తి రక్షణ కల్పిస్తామని, 'తెలంగాణ రైజింగ్' లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక పారిశ్రామికవేత్తలు ప్రపంచస్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళా, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సూచించారు.

ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..

మొదటి పేజీ తరువాయి

దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెట్రోవో దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు.ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ

మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు.దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

'సర్'పై సుప్రీంలో ఒవైసీ పిటిషన్

మొదటి పేజీ తరువాయి

తరపు న్యాయవాది నిజాం పాషా సమర్పించిన ఈ పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్వీకరించింది. సర్ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ రాహుల్ గాంధీ ఇతర విపక్షనేతలు ఇప్పటికే పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. గురువారం విచారణ కోసం ఈ రెండు పిటిషన్లను లిస్ట్ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. సర్ ప్రక్రియ అంతా కూడా ప్రజాప్రాతినిధ్య చట్టం, ఓటర్ల నమోదు నిబంధనలు-1960కు లోబడి పూర్తిగా చట్టబద్ధంగా జరిగేలా సుప్రీం జోక్యం చేసుకోవాలని పిటిషన్‌లో ఒవైసీ కోరారు. ఈసీలో ఇతర కమిషనర్లకు తెలియకుండా, వారి అమోదం లేకుండా ఈసీ పేరుతో నిర్ణయాలు వెలువడ్డాయని పిటిషన్‌లో ఒవైసీ ఆరోపించారు. కాగా, అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విపక్షాలతో జట్టు కట్టేందుకు మజ్లిస్ సిద్ధంగా ఉందని, తమను కూడా కూటమిలో భాగస్వాములుగా చేసుకోవాలని కోరుతున్నామని పేర్కొన్నారు. యూపీలో యోగి మూడోసారి సీఎం కావడం తమ పార్టీకి కూడా ఇష్టం లేదని వ్యాఖ్యానించారు. బీజేపీని ఓడించడమే తమ పార్టీ లక్ష్యం అని.. 2029లో ఆ పార్టీ గెలవకుండా ఉండేందుకు పూర్తి ప్రయత్నాలు చేస్తామని పేర్కొన్నారు.

గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌కు

తరలిరండి

'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌కు అనుగుణంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ 2026'లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి... 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ - 2026'కు ఆయన గౌరవ అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, నూతన పరిశ్రమలకు ప్రోత్సాహం, వ్యాపారాలకు అనుకూల వాతావరణం కల్పించడంపై దృష్టి సారించామన్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైనట?సిస్‌తో పాటు ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగం, అధునాతన తయారీ లాంటి రంగాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమలను విస్తరించేందుకు గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు మరింత ఆసరా

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ, అక్టోబరు 14: దేశంలోని పేద కుటుంబాలకు, ప్రత్యేకించి దివ్యాంగులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమాన్ని (ఎన్ఎస్ఏపీ) పునర్ వ్యవస్థీకరించి, 2030-31 వరకు ఐదేళ్ల పాటు రూ.53,428 కోట్ల వ్యయంతో కొనసాగించేందుకు ఆమోదం తెలిపింది. ఈ పథకం పేరును 'ప్రధాన మంత్రి సామాజిక సహాయతా యోజన'గా మార్చింది. అంతేకాకుండా ఇప్పటివరకు దివ్యాంగుల పింఛను పొందడానికి ఉన్న 18 ఏళ్ల కనీస వయోపరిమితి నిబంధనను రద్దు చేసింది. దీంతో పుట్టినప్పటి నుంచే దివ్యాంగ చిన్నారులకు పింఛను మంజూరు చేయనున్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 నిబంధనల ప్రకారం.. వైకల్య పరిమితిని 80 నుంచి 40 శాతానికి తగ్గించడంతో పాటు ఇతర క్యాటగిరీల సంక్షేమ పథకాలతో పోలిస్తే దివ్యాంగులకు అందించే సహాయం కనీసం 25 శాతం ఎక్కువగా ఉండాలని క్యాబినెట్ నిర్ణయించింది. అత్యుత్తమ పనితీరుకు గుర్తింపుగా 11.40 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదకత ఆధారిత బోనస్ (పీఎల్‌బీ) కింద రూ.2009.61 కోట్ల చెల్లింపునకు ఆమోదం తెలిపింది.ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పీఎం సామాజిక సహాయతా యోజన కింద 79 ఏళ్లలోపు వయసు వారికి నెలకు రూ.375, 80 ఏళ్లు, ఆపైబడిన వయసు వారికి నెలకు రూ.625 చొప్పున కేంద్రం తన వాటాగా అందిస్తుంది (దీనికి రాష్ట్రాలు ఇచ్చే వాటా అదనం). వృద్ధులు, వితంతువుల పింఛను పథకాలు, కుటుంబ ప్రయోజన పథకం ప్రస్తుతం ఉన్న రూపంలోనే కొనసాగుతాయి. కేంద్ర మంత్రివర్గ తాజా నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా 3.20 కోట్ల మంది ప్రయోజనం పొందుతారు. రాబోయే మూడు నెలల్లో కొత్త మార్గదర్శకాలు పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తాయి.

దసరా తర్వాత భారీ బహిరంగ సభ

మొదటి పేజీ తరువాయి

బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ దేశం ప్రమాదంలో పడిందని, సంపన్నులకు రూ. లక్షల కోట్ల రుణాల మాఫీ జరగగా.. సామాన్యులకు మాత్రం ఒరిగిందేమీ లేదని విమర్శించారు. 15 ఏళ్లుగా నిలిచిపోయిన ఆర్టీసీ కార్మిక సంఘాలకు ఎన్నికలను తమ ప్రభుత్వం పునరుద్ధరించిందని, కార్మికుల శ్రేయస్సుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. త్వరలో జరగబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 23న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్నట్లు వెల్లడించారు. పార్టీలో కష్టపడ్డవారికి న్యాయం చేసే ఉద్దేశంతోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ ఆలస్యం అవుతోందని, దసరాకు అటు, ఇటుగా దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు. ఎర్రవల్లిలో 45 ఎకరాల భూమి ఎవరి కబ్జాలో ఉందనే అంశంపై విచారణ జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ నిర్వహిస్తున్న సింగరేణి గర్జనకు అర్థంలేదని, కేసీఆర్ పదేళ్లపాటు సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి టైంపాస్ చేశారని విమర్శించారు.

'సర్' గడువు మరోసారి పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

అమరావతి, అక్టోబరు 14 : రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 (సర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి పొడిగించింది. నోటీసులు, క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారానికి ఈ నెల 10 వరకు ఉన్న గడువును 22వ తేదీకి గడువు పొడిగించింది. అలాగే తుది ఓటర్ల జాబితా ప్రచురణ గడువు 16వ తేదీ వరకు ఉండగా, దానిని తాజాగా 30వ తేదీకి పొడిగించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది సెప్టెంబరు 10వ తేదీ వరకు అందిన పెండింగ్ క్లెయిములు, అభ్యంతరాలతోపాటు ఆ తర్వాత అక్టోబరు 12వ తేదీ వరకు అందిన దరఖాస్తులు,అభ్యంతరాలన్నింటినీ ఈ నెల 22లోగా పరిష్కరించాలని సీఈవో వివేక్ యాదవ్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం జిల్లా ఎన్నికల అధికారులు తమ కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించి నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.





ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం నాడు నాగర్ కర్నూల్ పట్టణంలోని జ్ఞానేశ్వర వాస్తల్య మందిరం చిల్డ్రన్ హోమ్ లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిహారిక హాజరై అంతర్జాతీయ బాలికల దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, బాల్య వివాహాలు మరియు అసమానతలపై సమాజంలో అవగాహన పెంచడం ఈ రోజు ప్రధాన లక్ష్యం అన్నారు. నేటికి కొన్ని ప్రాంతాలల్లో ఆడపిల్లలకు చదువుకునే అవకాశం దక్కడం లేదని, బాలికలందరికీ నాణ్యమైన విద్యను అందించడం, వారు పాఠశాలలు మానేయకుండా చూడాలి అని అన్నారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హింసను అరికట్టడం మరియు వారికి సరైన పోషకాహారం, వైద్య సదుపాయాలు అందేలా చూడాలి అన్నారు. ఆడ పిల్లలకు సమాన అవకాశాలు కల్పించి, వారిని భవిష్యత్తులో స్వయం సమృద్ధి గల పౌరులుగా తీర్చి దిద్దాలి అన్నారు. జీవితంలో విద్యార్థి దశ అనేది కీలక దశ కాబట్టి అందరూ చక్కగా చదువుకొని జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలి అని అన్నారు. వారికి ఏమైనా సహాయం కావాలంటే మా సంస్థ తరఫున సహాయ సహకారాలు అందిస్తాం అని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీరామ్ ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్,చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు,చిన్నారులు పాల్గొన్నారు.



అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చర్యలు

జనగామ మున్సిపాలిటీ ప్రత్యేక నిబంధనలు

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ పట్టణంలో ఫ్లెక్సీలను ఇష్టానుసారంగా ఏర్పాటు చేయకుండా, పట్టణ సుందరీకరణను కాపాడటంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులను నివారించేందుకు మున్సిపాలిటీ ఒక ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చింది. ఈ మేరకు జనగామ మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, పట్టణంలో ఫ్లెక్సీలు లేదా లాలీపాప్‌లు ఏర్పాటు చేయదలచిన వ్యాపారులు, రాజకీయ పార్టీలు, సంఘాలు మరియు వ్యక్తులు విధిగా మున్సిపాలిటీ అనుమతి పొందాలని స్పష్టం చేశారు.ఈ నూతన విధానం ప్రకారం కమర్షియల్ ఫ్లెక్సీలకు వారానికి రూ. 1,000, నాన్-కమర్షియల్ ఫ్లెక్సీలకు వారానికి రూ. 500, అలాగే కమర్షియల్ లాలీపాప్‌లకు రూ. 200 మరియు నాన్-కమర్షియల్ లాలీపాప్‌లకు రూ. 100 చొప్పున నిర్ణీత రుసుములను చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి గలవారు తాము ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రదేశం, వార్డు వివరాలు మరియు కాలవ్యవధిని తెలుపుతూ సంబంధిత వార్డు ఆఫీసర్ వద్ద లేదా మున్సిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు.సాధారణంగా సోమవారం నుంచి శనివారం వరకు అనుమతులు జారీ చేయబడతాయని, అనుమతి పొందిన ఫ్లెక్సీలను తదుపరి సోమవారం తొలగించాలని తెలిపారు. గరిష్టంగా నాలుగు వారాల వరకు మాత్రమే అనుమతి పొందవచ్చని, అవసరమైతే నిర్ణీత రుసుము చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఫ్లెక్సీల ఏర్పాటు వల్ల ట్రాఫిక్‌కు, పాదచారులకు, విద్యుత్ లైన్లకు ఎటువంటి ఆటంకం కలగకూడదని, నిబంధనలను అతిక్రమిస్తే మున్సిపల్ సిబ్బంది వాటిని తొలగించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. పట్టణ పరిశుభ్రత మరియు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అందరూ మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా సహాయ కార్యదర్శిగా కలకోల రఘు

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం పాములూర్ గ్రామానికి చెందిన కలకోల రఘు టిపిసిసి ఎస్సీ డిపార్ట్‌మెంట్ జనగామ జిల్లా సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు.ఈ మేరకు జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ ఛైర్మన్ వేముల మల్లేష్ మహారాజ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలకోల రఘు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధన్వతి లక్ష్మీనారాయణ నాయక్ కు మరియు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేముల మల్లేష్ మహారాజ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జనగామ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి, పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన ఆకాంక్షించారు. ?తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ నిరంతర సరఫరాకు కృషి చేయాలి

విద్యుత్ ఉద్యోగులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచన

అచ్చంపేట నియోజకవర్గంలో రూ.150 కోట్లతో విద్యుత్ మౌలిక వసతుల కల్పన

అచ్చంపేట,మన ప్రజాపక్షం:
విద్యుత్ ప్రజలకు ప్రాణవాయువు లాంటిదని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా విద్యుత్ శాఖ ఉద్యోగులు కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి,అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి ఉప ముఖ్యమంత్రి విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట డివిజన్ పరిధిలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, వినియోగం, మౌలిక వసతులు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ సరఫరాకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతోపాటు, విద్యుత్ శాఖ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.



అచ్చంపేట నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, సుమారు రూ.150 కోట్లతో విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.విద్యుత్ శాఖ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతోపాటు,వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో వ్యవసాయం, తాగునీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వీటికి అనుగుణంగా విద్యుత్ డిమాండ్ పెరిగినా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.విద్యుత్ శాఖలో లైన్‌మెన్ స్థాయి నుంచి సీఎండీ వరకు పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో ఎవరైనా ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.కోటి ప్రమాద బీమా సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఉద్యోగుల సంక్షేమం, భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు.విద్యుత్ ఉద్యోగుల సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలకు తావు ఇవ్వకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు మెరుగైన విద్యుత్ అందిస్తూ విద్యుత్ శాఖ నుండి ప్రజలకు అందించే ఉత్తమ సేవలను ప్రజల దృష్టికి తీసుకు వచ్చేలా కార్యక్రమాలను సైతం ప్రచారం చేయాలన్నారు.అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలో అవసరమైన విద్యుత్ అవసరాల కల్పనకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రాధాన్యతతో ఏర్పాటు కల్పిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూనే ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.విద్యుత్ అంతరాయం ఏర్పడడం వెంటనే పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టడంలో విద్యుత్ శాఖ సిబ్బంది చర్యలపై ఆయన ప్రశంసించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయం,విద్యుత్ శాఖ అధికారులు అచ్చంపేట నియోజకవర్గ విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు

ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలి

ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్న గిరిజన రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

అభివృద్ధి పనులను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలి

లాభదాయకమైన పంటల సాగుపై గిరిజన రైతులకు అవగాహన కల్పించాలి

జిల్లా ఉన్నతాధికారుల సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించుకోవాలని, అవసరమైన చోట్ల చెరువులు, కుంటలను నింపే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.?జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై జిల్లా ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ?రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని, నీటి వృథాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. చెరువులు, కుంటల్లో నీటి నిల్వలను పెంచుకునే అవకాశాలను పరిశీలించాలని,



భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, నీటిని బాధ్యతాయుతంగా వినియోగించుకునేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాబోయే రెండేళ్లకు అవసరమైన ఆహార ధాన్యాలు అందుబాటులో ఉన్నాయని, ఆహార కొరత ఏర్పడుతుందనే ఆందోళన ప్రజలు చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు సరైన సమాచారం అందిస్తూ, తాగునీటి సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

పోడు రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఆర్ఓఎఫ్ఆర్) కింద పట్టాలు పొందిన గిరిజన రైతులు తమ భూముల్లో సాగు చేసుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గిరిజన రైతుల హక్కులను పరిరక్షిస్తూ, వారికి వ్యవసాయంలో మరింత ప్రోత్సాహం అందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన గిరిజన రైతుల భూముల్లో సౌర విద్యుత్ ఆధారిత సాగు సదుపాయాలను కల్పించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఇందిరా సౌర జల వికాసం పథకం ద్వారా రైతులు ఉద్యాన పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. అవకాడో, ఆయిల్‌పామ్, వెదురు వంటి లాభదాయకమైన పంటల సాగుపై ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు.?జిల్లాలోని భూములు దానిమ్మ, ద్రాక్ష వంటి పండ్ల తోటల సాగుకు అనుకూలంగా ఉన్నాయా లేదా అనే అంశంపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవకాశాలను పరిగణనలోకి తీసుకుని రైతులకు ప్రయోజనం చేకూర్చే పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు.ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూసేకరణకు సంబంధించిన పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తర్వాత వాటిని లబ్ధిదారులకు సకాలంలో అందించాలని, కలెక్టర్ ఖాతాల్లో నిధులను నిల్వ ఉంచడం తగదని స్పష్టం చేశారు. పరిహారం కోసం ఎదురుచూస్తున్న బాధితులకు నిబంధనల ప్రకారం త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాఠశాలల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలి

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల పురోగతిని భట్టి విక్రమార్క సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించేందుకు చేపడుతున్న నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యమిస్తూ, తాగునీటి సంరక్షణతోపాటు అన్ని రంగాల్లో సమర్థవంతమైన సేవలు అందించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవ సహాయం, జిల్లా ఫారెస్ట్ అధికారి రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే వ్యక్తి పురోభివృద్ధి-గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

జనగామ, మన ప్రజాపక్షం:సమాజంలో ఏ వృత్తికి చెందిన వారికైనా సమస్యల పరిష్కారానికి, వ్యక్తిగత పురోభివృద్ధికి విద్యే ప్రధానమని గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ బండి సాయన్న గౌడ్ అన్నారు. జనగామ కౌండిన్య పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈ రోజు నాగారం మామిడి తోటలో నిర్వహించిన పదో తరగతి గౌడ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.కౌండిన్య పరపతి సంఘం అధ్యక్షుడు కుర్రెముల యాదగిరి గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 2025--2026 విద్యా సంవత్సరంలో జనగామ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు నగదు పురస్కారాలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించారని పేర్కొన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించడం ద్వారా తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు.పురస్కారాల్లో భాగంగా గిరిగాని సిరిచందనకు ప్రథమ, బాలగోని సంజనకు ద్వితీయ, బబ్బూరు మనోజ్ కుమార్‌కు తృతీయ బహుమతులు అందజేశారు. పూజారి రక్షిత, నాయకపు రక్షిత, రాగిణి, శ్రీలేఖలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పరపతి సంఘం సభ్యులు టి. శారద, దూడల రమేష్ గౌడ్ , బూడిద సుధాకర్ గౌడ్,బూరుగు శ్రీనివాస్ గౌడ్ లను ఈ సందర్భంగా సన్మానించారు.సంఘం గౌరవాధ్యక్షుడు కన్నా పరశురాములు మాట్లాడుతూ సంఘం ప్రారంభమైనప్పటి నుంచి అధ్యక్షుడు కుర్రెముల యాదగిరి గౌడ్ నేతృత్వంలో ఆర్థిక అభివృద్ధితో పాటు విజ్ఞాన విహార యాత్రలు నిర్వహిస్తూ సభ్యుల్లో సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తున్నారని తెలిపారు. మహిళలు, పిల్లల కోసం ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కుటుంబ సభ్యులను ప్రోత్సహిస్తున్న సంఘం కార్యవర్గాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గునిగంటి



వెన్నెల రామకృష్ణ గౌడ్, సంఘం కార్యవర్గ సభ్యులు అంబటి రాజయ్య గౌడ్, వి. విజయకుమార్ గౌడ్, కోశాధికారి దూడల రమేష్ గౌడ్, విశ్రాంత ఆచార్యులు మాచర్ల రాములు గౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు భైరగోని శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దూడల రాజసంపత్ గౌడ్, రెడ్‌క్రాస్ సభ్యుడు మేకపోతుల ఆంజనేయులు గౌడ్, మాచర్ల ప్రభాకర్ గౌడ్, టి. రామచంద్రం గౌడ్, విద్యాసాగర్ గౌడ్, కుర్రెముల మాధవి గౌడ్, దూడల శోభారాణి గౌడ్, గూడ రాజబోసు గౌడ్, కన్నా శ్రీనివాస్ గౌడ్, టి.లక్ష్మయ్య గౌడ్, మడిపెల్లి ఐలయ్య గౌడ్, భారతమ్మ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో బాహుబలి మోటార్లు ప్రారంభించిన మంత్రి జూపల్లి

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది

రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు?





నాగర్‌కర్నూల్,మన ప్రజాపక్షం:
ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే దీన్ని జాతికి అకింతం చేశారని, కానీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఇతర పనులను గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టును గత పాలకులు పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు.మహాత్మాగాంధీ-కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.60 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, భీమా ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, కోయిలాసాగర్ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని తెలిపారు.ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు.రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన గత పాలకులు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో ప్రజలకు వివరించాలని నిలదీశారు. రైతాంగానికి సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుతం ప్రాజెక్టుల పురోగతిపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం మేరకు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల వారీగా సమస్యలను గుర్తించి, పనుల పురోగతిని సమీక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడం, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యమని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో మంత్రి జూపల్లి

కొల్లాపూర్,మన ప్రజాపక్షం:
అంకిరావుపల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. నూతన గృహాల్లోకి అడుగుపెట్టిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి సౌకర్యం కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. సొంతింటి ద్వారా పేద కుటుంబాలకు భద్రత, భరోసా కల్పించడంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఈ పథకం దోహదపడుతోందని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. మహిళలు, రైతులు, పేద కుటుంబాల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



లింబాబి గ్రామంలో వైభవంగా దేవీ నవరాత్రులు

నాలుగో రోజు అమ్మవారికి ఘనంగా ప్రత్యేక పూజలు



కుంటాల,మన ప్రజాపక్షం:
లింబాబి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు రోజురోజుకూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాలుగో రోజు అమ్మవారి పూజా కార్యక్రమాలను గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా త్రిపుర సుందరి దేవి (లేదా స్థానిక సంప్రదాయ రూపం) అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఆధ్యాత్మిక శోభతో పులకించిన ఆలయ ప్రాంగణం

ఉదయం నుంచే ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, మరియు విశేష అలంకరణలు చేశారు. వివిధ రకాల సుగంధ పుష్పాలు, విశేష నైవేద్యాలతో అమ్మవారిని కొలిచారు. భక్తులందరూ ఒకరికొకరు తోడై భజనలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణాన్ని భక్తి రసార్ద్రం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక హారతులు ఇచ్చి, తమ కుటుంబాలు చల్లగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

అన్నదాన కార్యక్రమం మరియు భక్తుల సందడి

పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలిరావడంతో లింబా (బి) గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

కమిటీ సభ్యుల హర్షం

ఉత్సవాలు ఇంత విజయవంతంగా సాగుతుండటంపై ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, రాబోయే రోజుల్లో జరిగే పూజల్లో కూడా భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం

మన్ననూర్‌లో స్వాగతం పలికిన

ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ,ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు అచ్చంపేట శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, డీఎఫ్ఓ రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ రెవిన్యూ బి.చెన్నయ్య, బుధవారం అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూర్ గ్రామంలో పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.ఉప ముఖ్యమంత్రి మన్ననూర్‌కు చేరుకున్న సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఉపముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. జిల్లా పర్యటనలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మన్ననూర్‌కు చేరుకున్నారు.

ప్రజల ప్రాణాలకంటే రాజకీయాలే ముఖ్యమా

నిర్మల్ క్రిటికల్ కేర్ బ్లాక్‌ను వెంటనే ప్రారంభించాలి



నిర్మల్,మన ప్రజాపక్షం: నిర్మల్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్మించిన 50 పడకల అత్యాధునిక క్రిటికల్ కేర్ బ్లాక్‌ను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఆయన పార్టీ నాయకులతో కలిసి సందర్శించి, అక్కడి నిర్మాణ పనులు, వైద్య సదుపాయాలను పరిశీలించారు. సుమారు 25 శాతం పనులు ఇంకా అసంపూర్తిగా ఉండటంతో పాటు, వెంటిలేటర్లు వంటి కీలక వైద్య పరికరాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉండటంతో ప్రారంభం ఆలస్యమవుతున్నట్లు పరిశీలనలో గుర్తించినట్లు తెలిపారు.

నాలుగు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు.. మరి ఇప్పటికీ ఎందుకు ప్రారంభించలేదు?

అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నాలుగు రోజుల్లో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ, ఇప్పటికీ ఎందుకు అందుబాటులోకి తీసుకురాలేదని సయ్యద్ హైదర్ ప్రశ్నించారు. పనులు అసంపూర్తిగా ఉండటం, కీలక పరికరాలు పెండింగ్‌లో ఉండటంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం ఎందుకని నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్య రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతుండగా, ప్రజలకు ఉపయోగపడాల్సిన అత్యవసర వైద్య సదుపాయం మాత్రం ప్రారంభానికి నోచుకోకపోవడం బాధాకరమని విమర్శించారు.

ప్రజలకు కావాల్సింది రాజకీయాలు కాదు.. ప్రాణాలు కాపాడే వైద్యం!

ఈ క్రిటికల్ కేర్ బ్లాక్‌లో ఐసీయూ, హెచ్‌డీయూ, 7 పడకల డయాలసిస్ యూనిట్, ఐసోలేషన్ వార్డులు, రెండు ఆపరేషన్ థియేటర్లతో పాటు ఆధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. మిగిలిన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి, పెండింగ్‌లో ఉన్న వెంటిలేటర్లు సహా కీలక వైద్య పరికరాలను సమకూర్చి, అవసరమైన సిబ్బందిని నియమించాలని సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు.ప్రజారోగ్యాన్ని రాజకీయాలకు బలి చేయొద్దని, అత్యవసర చికిత్స కోసం హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితిని తగ్గించాలని కోరారు. క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభానికి ప్రభుత్వం ఖచ్చితమైన తేదీ ప్రకటించి, పూర్తిస్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జనరల్ సెక్రటరీ సీ.హెచ్. వినోద్, ట్రెజరర్ సాధిక్, వైస్ ప్రెసిడెంట్ బైండ్ల శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుగు రాజన్న, చుక్కలా భూమన్న, శీతల్కార్ అరవింద్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ... పాల్గొన్న రామిని కుటుంబ సభ్యులు



జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ పట్టణ కేంద్రంలోని పాత బీట్ బజార్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దివంగత రామిని శోభారాణి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాల వేళ భక్తులకు సేవలందించడం ఎంతో పుణ్యఫలమని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామిని చిరంజీవులు, రాకేష్ – దివ్య, జగదీశ్ – సంతోషి దంపతులతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. వీరితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఉమ్మడి నల్గొండ జిల్లా ఎక్సైజ్ శాఖలో వసూళ్ల పర్వం

మాకే అంతా కావాలంటున్న జిల్లా బాసులు!

శిక్షణకు వెళ్లిన ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల్లో మామూళ్లపై కన్ను

20-25 లక్షలు పెట్టి వచ్చామంటూ హుకుం

నల్గొండ,మన ప్రజాపక్షం:
ఉమ్మడి నల్గొండ జిల్లా ఆపాక్రి (ఎక్సైజ్) శాఖలో జిల్లా స్థాయి అధికారుల వసూళ్ల దందా తారాస్థాయికి చేరిందనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.విశ్వసనీయ సమాచారం మేరకు, ఉమ్మడి జిల్లాలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులు అంతా మాకే కావాలంటూ కిందిస్థాయి సిబ్బందిపై హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. శిక్షణకు వెళ్లిన ఎస్సైలు, కానిస్టేబుళ్లు పనిచేస్తున్న స్టేషన్లలో ఖాళీ అయిన స్థానాల నుండి వచ్చే మామూళ్లను తమకు అప్పగించాలంటూ జిల్లా స్థాయి అధికారులు బెదిరింపులకు దిగుతున్నారు. ఈ పోస్టింగుల కోసం 20 లక్షలు, 25 లక్షలు పెట్టుకొని వచ్చాము, మా డబ్బులు మేము త్వరగా రాబట్టుకోవాలి, అందుకే మీరు కింది స్థాయిలో మాకు ముడుపులు చెల్లించాలి" అంటూ సిబ్బందిని తీవ్ర మనోవేదనకు, ఒత్తిడికి గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పై ఫోటోలో ఉన్నట్లుగా మద్యం సీసా నుండి వచ్చే ప్రతి రూపాయి నేరుగా జిల్లా బాసుల జేబుల్లోకి వెళ్తున్న పరిస్థితి నెలకొందని సిబ్బంది వాపోతున్నారు.అంతేకాకుండా ఉమ్మడి జిల్లా స్థాయిలోని స్టేషన్లకు సంబంధించిన సీఐలు డబ్బులు చెల్లించి వసూలు చేసుకుంటే, వారు విధులకు రాకున్నా సరే, ఆ పనులను కిందిస్థాయి సిబ్బందితో చేయించుకుంటామని, మీరు కేవలం డబ్బులు ఇస్తే చాలు అన్నట్టు సీఐలకు జిల్లా అధికారులు అల్టిమేటం జారీ చేస్తున్నారని తెలిసింది.ఈ వేధింపులతో



కిందిస్థాయి సిబ్బంది తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వారిని ఎలాగైనా శాఖా పరమైన చర్యలు తీసుకునే విధంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం.ఈ విషయంపై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యాలయం అబ్కారీ భవన్ లో ఉన్న ఎక్సైజ్ కమిషనర్ మరియు ఏసీబీ అధికారులు వెంటనే దృష్టి సారించి, నిఘా పెట్టి విచారణ జరపాలని నిజాయితీ గల ఉద్యోగులు కోరుతున్నారు.

భూ వివాదంతో దుకాణంపై యాసిడ్ దాడి.... కేసు నమోదు

?జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ పట్టణంలో భూ వివాదం కారణంగా ఓ దుకాణంపై యాసిడ్ బాటిల్ విసిరిన ఘటన కలకలం రేపింది. బాధితుడు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జనగామ నివాసి, కంసాలి వృత్తి (బంగారు ఆభరణాల తయారీ) చేసుకునే సిరికొండ లక్ష్మణాచారి (55, తండ్రి: ఈశ్వరాచారి) భార్య సిరికొండ పద్మావతికి, ఆమె అన్నదమ్ములకు మధ్య కొంతకాలంగా స్వంత భూమికి సంబంధించి తీవ్ర వివాదం నడుస్తోంది.ఈ క్రమంలోనే, బుధవారం సాయంత్రం సుమారు 4:00 గంటల ప్రాంతంలో లక్ష్మణాచారి బావమరిది అయిన మల్లోజుల లక్ష్మణాచారి (తండ్రి: పాండురంగాచారి, నివాసం: పాలేరు, ఆలేరు) భూ వివాదాన్ని మనసులో ఉంచుకుని దుకాణం వద్దకు వచ్చి, ఆకస్మాత్తుగా దుకాణంపై యాసిడ్ బాటిల్ విసిరి దాడికి పాల్పడినట్లు తెలిసింది.?ఈ ఆకస్మిక ఘటనతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుడు మల్లోజుల లక్ష్మణాచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు సమాచారం.



తిరుమలగిరి మార్కెట్లో ధాన్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సామెల్

తిరుమలగిరి,మన ప్రజాపక్షం:
తిరుమలగిరి మండల కేంద్రంలోని మార్కెట్లో రైతులకు మద్దతు ధర కంటే అధికంగా ధాన్యాన్ని కొనుగోలు చేయడం శుభపరిణామం అని రైతులందరూ మార్కెట్కు ధాన్యాన్ని తీసుకువచ్చి మంచి ధర పొందగలరని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. బుధవారం నాడు ఆయన మార్కెట్ సందర్శించి రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ మార్కెట్లో అదనపు ధాన్యం షెడ్ల కోసం సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో తక్షణమే మాట్లాడి మంజూరు చేయించినారు. మార్కెట్లో కావలసిన సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్, యేల్లోజు చామంతి నరేష్,పలువురు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు వ్యాపారస్తులు మార్కెట్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



దక్షిణాఫ్రికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన పటేల్ రమేష్ రెడ్డి

సూర్యాపేట,మన ప్రజాపక్షం:
సౌత్ ఆఫ్రికా తెలంగాణ అసోసియేషన్ ఆహ్వానం మేరకు దక్షిణాఫ్రికాలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన తెలంగాణ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్కని ఈరోజు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్కతో పటేల్ రమేష్ రెడ్డి ఆత్మీయంగా మాట్లాడి ఆమె దక్షిణాఫ్రికా పర్యటన విశేషాలను తెలుసుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విదేశాల్లో ఘనంగా నిర్వహించడం, తెలంగాణ ఆడపడుచులు తమ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.అనంతరం ప్రజా సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళా సాధికారత, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వంటి పలు అంశాలపై ఇరువురు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పరస్పర సహకారంతో ముందుకు సాగాలనే ఆకాంక్షతో ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

మన ప్రజాపక్షం

నియోజకవర్గానికి విద్యా సంస్థలు
మంజూరు చేయాలని సీఎంకు విజ్ఞప్తి

నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి

జనగామ, మన ప్రజాపక్షం:
జనగామ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా విద్యా రంగానికి పెద్దపీట వేయాలని కోరుతూ జనగామ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ హైస్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్ మరియు కాకతీయ ఇంజనీరింగ్ కళాశాలను తక్షణమే మంజూరు చేయాలని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్న కేంద్రీయ విద్యాలయం మరియు నవోదయ విద్యాలయాన్ని కూడా వెంటనే మంజూరు చేయించాలని ఆయన కోరారు.

వలసల నివారణకు, విద్యారంగ అభివృద్ధికి విద్యా సంస్థలే కీలకం

జనగామ నియోజకవర్గం విద్య మరియు ఉపాధి రంగాలలో వెనుకబడిన ప్రాంతంగా ఉందని, ఇక్కడి విద్యార్థులు ఉన్నత విద్య మరియు ఉద్యోగాల కోసం ఇతర నగరాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో విద్యకు సంబంధించిన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి తక్షణమే స్పందించాలని కోరారు.

జనగామ పేరు లేకపోవడం బాధాకరం

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ హైస్కూల్స్ మరియు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ జాబితాలో జనగామ లేకపోవడం ఇక్కడి విద్యార్థులకు మరియు ప్రజలకు తీవ్ర నిరాశను, బాధను కలిగించిందని బిర్రు ఇస్తారి పేర్కొన్నారు.?

విద్యార్థుల తరపున హృదయపూర్వక అభ్యర్థన

?వెనుకబడిన జనగామ నియోజకవర్గ విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యా సంస్థలతో పాటు, కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సిన కేంద్రీయ విద్యాలయం, నవోదయ విద్యాలయం మరియు కాకతీయ ఇంజనీరింగ్ కళాశాలను త్వరగా మంజూరు చేయించాలని జనగామ విద్యార్థుల తరపున హృదయపూర్వకంగా బిర్రు ఇస్తారి విజ్ఞప్తి చేశారు.



సేవాదళ్ నూతన కమిటీ ప్రకటన..
52 మందితో జాబితా విడుదల

జనగామ, మన ప్రజాపక్షం:తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ మరియు డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో జనగామ జిల్లా సేవాదళ్ నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్, డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని, మరియు జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాలు, సూచనల మేరకు ఈ నియామకాలు చేపట్టారు. జనగామ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు జాయ మల్లేష్ అధ్యక్షతన జిల్లాలో సేవాదళ్‌ను గ్రామస్థాయి నుండి మరింత బలోపేతం చేసే లక్ష్యంతో వివిధ స్థాయిల్లో ఈ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, ట్రెజరర్, సోషల్ మీడియా ఇన్‌చార్జిలు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, అలాగే బ్లాక్ మరియు టౌన్ అధ్యక్షులను నియమిస్తూ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ బుధవారం అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 52 మంది నాయకులకు ఈ కమిటీలో వివిధ బాధ్యతలు కేటాయించారు.?నూతనంగా నియమితులైన నాయకులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రజా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, పార్టీ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే సేవాదళ్‌ను క్షేత్రస్థాయిలో మరింత క్రియాశీలంగా తీర్చిదిద్ది, రాబోయే పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలని కోరారు



సేవాదళ్ నూతన జిల్లా కమిటీ వివరాలు:
జిల్లా వైస్ ప్రెసిడెంట్లు:
మంకెన మోహన్ రెడ్డి, నీరమాల సమ్మయ్య, లకావత్ హతీరామ్, ఎం.డి. యాకుబ్, మరపాక యాకయ్య, రాపోతుల ఉప్పలయ్య, రోడ్డ యాక లక్ష్మి.
జిల్లా జనరల్ సెక్రటరీలు:
మంతెన కిష్టయ్య, మేకల ఉపేందర్ రెడ్డి, కటకం ఉదయ్ కుమార్, రాగుల యాది రెడ్డి, బాలగోని కనుకయ్య, ఇమ్మడి తిరుపతి రెడ్డి.
జిల్లా ట్రెజరర్:
దాసరి శ్రీనివాస్ రెడ్డి.
జిల్లా సెక్రటరీలు:
నర్సింహాచారి, మోటే మల్లేశం, బైరపాక యాదగిరి, చేవుల రాజేష్, మొండగుజ్జుల రమేష్, లెంకల రాజు యాదవ్, పల్లా శ్రీనివాస్.
జిల్లా జాయింట్ సెక్రటరీలు:
కొయ్యడ శ్రీను, నాయం జయపాల్ రెడ్డి, కర్రె అశోక్, రవుల జనార్ధన్, కుక్కల రాములు, కర్రె రాజు, ధారావత్ బాలు నాయక్, ఐల అంజనేయులు, యెర్రం సిద్ధులు.
జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జిలు:
ధూపాటి రాజు, సంపల్లి అశోక్.
అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు:
రామచందర్ నాయక్ (పాలకుర్తి), మేకల మల్లేశం (స్టేషన్ ఘనపూర్), ఎం.డి. ఇస్మాయిల్ షరీఫ్ (జనగామ).
మండల అధ్యక్షులు:
గుంటిపల్లి హరినాథ్ (బచ్చన్నపేట), మోటే మహేష్ (చిల్పూర్), గుగులోత్ నరేందర్ (దేవరుప్పుల), తండ్ర కమలాకర్ (జనగామ), కునసోత్ రమేష్ (కొడకండ్ల), దండిగ ఇలయ్య (లింగాల ఘనపూర్), భూక్య వినోద్ కుమార్ (నర్మెట్ట), గాదెపాక శ్రీధర్ (పాలకుర్తి), చతరాబోయిన రాజు (రఘునాథపల్లి), సింగపురం బాబు (స్టేషన్ ఘనపూర్), సుంకరి అనిల్ కుమార్ (తరిగొప్పుల), తాటికాయల యెల్లయ్య (జాఫర్‌గఢ్).
బ్లాక్ ఉ టౌన్ అధ్యక్షులు:
శివరాత్రి పరశురాములు (జనగామ బ్లాక్), జిట్టబోయిన వెంకట లక్ష్మి (పాలకుర్తి బ్లాక్), మొగ్గం కృష్ణం రాజు (స్టేషన్ ఘనపూర్ బ్లాక్), కౌడే శ్రీనివాస్ (జనగామ టౌన్), కొండ వేణు (స్టేషన్ ఘనపూర్ టౌన్).
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సేవాదళ్ జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులందరికీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, శ్రేణులు హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

నల్లగొండ డీఎంహెచ్ఓ కార్యాలయంలో నియామకాలపై వివాదం!

ఆరు పోస్టుల భర్తీపై అనుమానాలు.. వసూళ్ల ఆరోపణలపై విచారణ ఎప్పుడు?
నోటిఫికేషన్ నుంచి మెరిట్ జాబితా వరకు.. నియామక ప్రక్రియలో పారదర్శకతపై నిరుద్యోగుల ప్రశ్నలు

నల్లగొండ, మన ప్రజాపక్షం:
నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కార్యాలయంలో జరిగినట్లు చెబుతున్న ఆరు ఉద్యోగ నియామకాలు వివాదాస్పదంగా మారాయి. నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించలేదని, నోటిఫికేషన్ జారీ చేయకుండానే పోస్టులను భర్తీ చేశారనే అనుమానాలు ఉన్నాయని కొందరు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఒక్కో పోస్టుకు రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు కూడా తెరపైకి రావడం కలకలం రేపుతోంది. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

ఆరు పోస్టుల భర్తీపై అభ్యంతరాలు

అందుబాటులో ఉన్న ఆరోపణల ప్రకారం.. నాలుగు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు, రెండు ఎస్‌టీఎల్‌ఎస్ పోస్టుల భర్తీ ప్రక్రియపై అభ్యర్థులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ప్రకటన ఎప్పుడు విడుదల చేశారు? ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు? అభ్యర్థుల అర్హతలు, మెరిట్ ఆధారంగా ఎంపిక చేశారా? ఎంపికైన వారి జాబితాను ఎందుకు బహిర్గతం చేయలేదు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో నిబంధనలు, అర్హతలు, మెరిట్, రిజర్వేషన్లు, రోస్టర్ విధానం పారదర్శకంగా అమలయ్యాయా లేదా అన్నది అధికారిక రికార్డుల పరిశీలనతోనే తేలాల్సి ఉంది.

వసూళ్ల ఆరోపణలు.. నిజానిజాలు తేలేదెప్పుడు?

ఒక్కో పోస్టుకు రూ. 2 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు వసూళ్లు జరిగాయనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ ఆరోపణలకు సంబంధించి ఎవరి వద్దైనా ఆధారాలు ఉన్నాయా? డబ్బులు చెల్లించినట్లు చెబుతున్న అభ్యర్థులు ఫిర్యాదులు చేశారా? నియామకాల వెనుక ఎవరైనా మధ్యవర్తులు వ్యవహరించారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని అభ్యర్థులు కోరుతున్నారు.అయితే, వసూళ్ల ఆరోపణలు ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కాలేదు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చినప్పుడే బాధ్యులెవరో స్పష్టమవుతుంది.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు.. సంజాయిషీ కోరినట్లు సమాచారం

నియామక ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న కొందరు అభ్యర్థులు ఆగస్టు 7న ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదు నేపథ్యంలో డీఎంహెచ్ఓను వివరణ కోరుతూ సంబంధిత ఉన్నతాధికారుల నుంచి లేఖ వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే, ఆ లేఖలో పేర్కొన్న అంశాలు, డీఎంహెచ్ఓ సమర్పించిన వివరణ, తదుపరి తీసుకున్న చర్యలపై అధికారిక సమాచారం వెల్లడికావాల్సి ఉంది.ఫిర్యాదుపై శాఖాపరమైన విచారణ ప్రారంభమైందా? విచారణకు ఏ అధికారిని నియమించారు? ఆరోపణలకు సంబంధించి ఏమైనా రికార్డులు పరిశీలించారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

'షాడో డీఎంహెచ్ఓ' పాత్రపై చర్చ

కార్యాలయంలో అధికారిక హోదాతో సంబంధం లేకుండా కీలక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఉద్దేశంతో ఒక వ్యక్తి పాత్రపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'షాడో డీఎంహెచ్ఓ' పాత్రపై విచారణ జరపాలని కొందరు కోరుతున్నారు. అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తి ఎవరు, ఆయనకు ఉన్న అధికారిక బాధ్యతలు ఏమిటి, నియామక ప్రక్రియలో ఆయన పాత్ర ఏమైనా ఉందా అనే విషయాలకు ఆధారాలతో కూడిన అధికారిక నిర్ధారణ అవసరం.అలాగే ఉద్యోగుల డిప్యుటేషన్లు, విధుల కేటాయింపులు, కార్యాలయ పరిపాలనా నిర్ణయాలపైనా సంబంధిత రికార్డుల ఆధారంగా సమగ్ర పరిశీలన జరపాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

రికార్డులు బయటపెడితేనే స్పష్టత



ఆరు పోస్టుల నియామకాలపై నెలకొన్న అనుమానాలకు తెరదించాలంటే సంబంధిత శాఖ పారదర్శకంగా వ్యవహరించాలని అభ్యర్థులు కోరుతున్నారు. నియామక ప్రకటనలు, దరఖాస్తుల స్వీకరణ వివరాలు, అర్హతల పరిశీలన, మెరిట్ జాబితా, ఎంపిక ఉత్తర్వులు, రోస్టర్ రిజిస్టర్, రిజర్వేషన్ల అమలు వివరాలు, ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలను పరిశీలనకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.మొత్తానికి నల్లగొండ డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆరు పోస్టుల భర్తీపై వ్యక్తమవుతున్న ఆరోపణలు, అనుమానాలపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. ఆరోపణల్లో నిజానిజాలను తేల్చేందుకు నిష్పక్షపాత విచారణ జరిపి, తప్పులు జరిగినట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమా, కేవలం అనుమానాలేనా అన్నది అధికారిక రికార్డులు, విచారణ ఫలితాల ద్వారానే తేలనుంది.నియామక ప్రక్రియపై పూర్తి వివరాలు ఎప్పుడు వెల్లడిస్తారు? ఫిర్యాదుపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? నిరుద్యోగులకు న్యాయం ఎప్పుడు జరుగుతుంది? అన్నది వేచి చూడాలి.

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

భూసేకరణలో పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట,మన ప్రజాపక్షం:
మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక రెవెన్యూ అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి తహసీల్దార్లతో భూసేకరణ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణకు సంబంధించి రైతులతో ఉన్న సమస్యలను గుర్తించి, వారితో చర్చించి పరిష్కార మార్గాలను ఖరారు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రతిపాదనలు, పరిహారం చెల్లింపులు, సర్వే నంబర్లకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు.అవసరమైన చోట రైతులను పిలిపించి చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించి, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎత్తిపోతల పథకానికి సంబంధించి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములు, ఆక్రమణలు లేని భూములు, భూముల స్థితిగతులు, సర్వే వివరాలపై తహసీల్దార్లు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. భూసేకరణకు అనువైన భూములను గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించే అవకాశం ఉన్నందున, భూములకు సంబంధించిన రికార్డులు, వివరాలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు.రేడియల్ రోడ్డు భూసేకరణ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, క్షేత్రస్థాయిలో సంబంధిత బృందాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రహదారి పనులకు ఆటంకం కలగకుండా పెండింగ్ సమస్యలను పరిష్కరించి, పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.అలాగే, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అవార్డులు, పరిహారం చెల్లింపులు, సర్వేకు సంబంధించిన అంశాలను సమీక్షించి,అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, భూసేకరణలో



ఎదురవుతున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.భూసేకరణ పనుల పురోగతిపై వచ్చే వారం మరోసారి సమీక్ష నిర్వహిస్తామని, అప్పటిలోగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆర్డీవో రమేష్, ఏవో అనిల్ కుమార్, ల్యాండ్ సర్వే ఏడీ వేణుగోపాల్ రెడ్డి, నారాయణ పేట, ఉట్కూర్, దామరగిద్ద, మద్దూరు, గుండుమల్, కోస్గి మండలాల తహసీల్దార్లు అమరేంద్ర కృష్ణ, అశోక్ కుమార్, తిరుపతయ్య, మహేష్, భాస్కర స్వామి, కళ్యాణి, సంబంధిత రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

వెంకటాపూర్‌లో భూ రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట,మన ప్రజాపక్షం:జిల్లాలో చేపడుతున్న భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక రెవెన్యూ, సర్వే శాఖ అధికారులను ఆదేశించారు.మరికల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో ప్రత్యేక సర్వే బృందాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను బుధవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన, శిక్షణ పొందిన సర్వే బృందాల సేవలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్‌లను ఆదేశించారు. రీసర్వే పనుల పురోగతిని జిల్లా యంత్రాంగం ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో భూ రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. భూముల కొలతలను కచ్చితత్వంతో చేపట్టి, భూహద్దులను స్పష్టంగా



నిర్ధారించేందుకు ఆధునిక రోవర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే ద్వారా భూ సరిహద్దుల నిర్ధారణతో పాటు రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని, భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా నివారించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.వెంకటాపూర్ గ్రామంలో 640 ఎకరాల భూమి ఉంది అని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఫౌండేషన్ ప్రకారం రీసర్వే నిర్వహించి, 108 మందికి ఫారం-11 జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్లాస్పూర్ గ్రామంలో 24 మందికి సంబంధించి రీసర్వే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు.సర్వే బృందాల్లో పనిచేస్తున్న చైన్‌మెన్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకోగా, ప్రస్తుతం 24 మంది చైన్‌మెన్లు విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిర్దేశించిన పనులన్నింటినీ రాబోయే 20 రోజుల్లోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.భూ రీసర్వే ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేసేందుకు రైతులు, గ్రామస్థులు సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏడీ వేణుగోపాల్ రెడ్డి, తహసీల్దార్ రామ్‌కోటి, రెవెన్యూ, సర్వే శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

నారాయణపేట,మన ప్రజాపక్షం:
నారాయణపేట పట్టణం భారంభావి చిల్డ్రన్స్ హోమ్ లో జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ సెక్రటరీ వింధ్య నాయక్, సీనియర్ సివిల్ జడ్జి ఆధ్వక్షన అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలికల శక్తిని గుర్తించడానికి, వారి హక్కుల కోసం వాదించడానికి, మరియు ప్రతి ఒక్క బాలికకు ఎదగడానికి, నేర్చుకోవడానికి, సురక్షితమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి అవకాశం ఉండేలా చూసుకోవడానికి ఈ రోజును ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారని,మీరు బలవంతులు, విలువైనవారు,మీ భవిష్యత్తు అపరిమితమైనది ఎందుకంటే, అబ్బాయిలు, అమ్మాయిలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసి సరైన దాని కోసం నిలబడినప్పుడే అమ్మాయిలకు సురక్షితమైన ప్రపంచం నిర్మించబడుతుందన్నారు.చట్టం మీకు ప్రత్యేక రక్షణ కల్పిస్తుందని మీకు తెలుసా? హక్కులు మిమ్మల్ని కాపాడే ఒక అదృశ్య కవచం లాంటివని పిలుపునిచ్చారు.మీలో ప్రతి ఒక్కరికీ పాఠశాలకు వెళ్ళడానికి, పుస్తకాలు చదవడానికి, ప్రశ్నలు అడగడానికి మరియు నేర్చుకోవడానికి హక్కు ఉంది. విద్య మీ అద్భుత శక్తి. దానిని మీ నుండి ఎవరూ తీసివేయలేరు. అమ్మాయిలకు అబ్బాయిలతో సమానమైన హక్కులు ఉన్నాయి. డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, క్రీడా ఛాంపియన్లు లేదా శాస్త్రవేత్తలు కావాలని కలలు కనే హక్కు మీకు ఉంది, మరియు ఆ కలలను సాకారం చేసుకునే హక్కు కూడా మీకు ఉంది.సురక్షితమైన వాతావరణంలో జీవించడానికి, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడానికి, మరియు అనారోగ్యంగా ఉన్నప్పుడు వైద్య సంరక్షణ పొందడానికి మీకు హక్కు ఉందని తెలిపారు.డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రాచందర్ గౌడ్ మాట్లాడుతూ మీ శరీరం మీదేనని ఎవరైనా మిమ్మల్ని తాకిన విధానం వల్ల మీకు అసౌకర్యంగా,భయంగా లేదా గందరగోళంగా అనిపిస్తే అది మీ తప్పు కాదని గుర్తుంచుకోండి. గట్టిగా వద్దు అని చెప్పే పూర్తి హక్కు మీకు ఉంది. మిమ్మల్ని బాధపెట్టే రహస్యాలను ఎప్పుడూ దాయవద్దు ఎవరైనా మిమ్మల్ని బాధపెట్టినా, ఇబ్బంది పెట్టినా, లేదా మీ మనసును బాధపెట్టే 'రహస్యాన్ని' దాచమని చెప్పినా, దాన్ని దాయవద్దు.మీకు ఎప్పుడైనా అభద్రతగా అనిపిస్తే, లేదా మీ స్నేహితుడు బాధగా ఉండటం గానీ, ఇతరులచే చెడుగా చూడబడటం గానీ గమనిస్తే, మీరు తప్పకుండా మాట్లాడాలి.ఇక్కడ హోమ్‌లో ఉన్న మీ సంరక్షకులకు చెప్పండి.మీరు నమ్మే ఉపాధ్యాయునికి చెప్పండి. పిల్లల సహాయం కోసం ఉచిత మ్యాజిక్ నంబర్‌ను గుర్తుంచుకోవాలన్నారు.చైల్డ్‌లైన్ (1098) కేవలం ఒక ఉచిత ఫోన్ కాల్ దూరంలోనే ఇది ఉంది.మీకు సహాయం చేయడానికి రోజులో 24 గంటలూ సిబ్బంది సిద్ధంగా ఉంటారు.జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు, న్యాయ సేవా కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు.చివరగా మీరు అందరు మా బిడ్డలు లాంటి వారు. మీరు అనాధలు కాదు...రాజ్యం,



న్యాయవ్యవస్థ,డిఎల్ఎస్ఏ మీకు అండగా ఉందని విద్యార్థులకు హామీ ఇచ్చారు.విద్యార్థులకు ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే ప్రతి విద్యార్థితో ఉండవలసిన హెల్ప్‌లైన్ నంబర్లు: 1098 - చైల్డ్ హెల్ప్‌లైన్ (24ఞ7), 181 - మహిళా హెల్ప్‌లైన్, 15100 -నల్సా ఉచిత న్యాయ సహాయం, 112 - అత్యవసర సేవ టోల్-ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆదేవిందగా మీ చిల్డ్రన్స్ హోమ్ సిబ్బందికి తెలియజేయాలకి అని ఆజ్ఞాపించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్,లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.లక్ష్మిపతి గౌడ్,మీనాక్షి,హసీనా బేగం సిడిపిఓ,శివలీల చిల్డ్రన్స్ హోమ్ సూపర్డెంట్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు

మంత్రి ఉత్తమ్,ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం

చిలుకూరు,మన ప్రజాపక్షం:చిలుకూరు మండలంలో రహదారుల అభివృద్ధికి రూ.40.50 కోట్ల నిధులు మంజూరు కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా రామాపురం గ్రామంలోని జాతీయ రహదారిపై మండల కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.సూర్యాపేట జిల్లాలో నాలుగు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.52.50 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయగా, చిలుకూరు మండలంలోని రెండు రహదారులకు రూ.40.50 కోట్లు కేటాయించారు. పాత జాతీయ రహదారి-9 నుంచి కొండాపురం వరకు 12.2 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ, పటిష్టీకరణ పనులకు రూ.27 కోట్లు, బేతవోలు నుంచి ఆచార్యులగూడెం వరకు 5.6 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.13.50 కోట్లు మంజూరయ్యాయి.రామాపురం గ్రామ రహదారి సమస్యను మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి పలుమార్లు తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేసిన కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. రహదారుల అభివృద్ధితో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కోదాడ పట్టణ అధ్యక్షులు వంటిపులి వెంకటేష్ చిలుకూరు మండల అధ్యక్షులు కీతా వెంకటేశ్వరరావు ,ప్రధాన కార్యదర్శి పిండ్రాతి హనుమంతరావు,జిల్లా నాయకులు రాయబారపు వెంకటేశ్వర్లు, రామాపురం సర్పంచ్ వేమూరి సతీష్ కుమార్, నర్సింహపురం సర్పంచ్ సత్యనారాయణ,అల్లి మట్టయ్య, యూత్ అధ్యక్షులు విజయభాస్కర్,రామాపురం మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు నల్లబోతు సత్యనారాయణ అల్లి వీ రబాబు, అల్లి మల్లయ్య,కుక్కడపు శ్రీను,మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎండిపోయిన పత్తి పంటలకు ఒక్క ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలి

అమ్రాబాద్,మన ప్రజాపక్షం:
అమ్రాబాద్ మండలంలోని తెలుగు పల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎండిపోయిన పత్తి పంటలను సిపిఎం పార్టీగా పరిశీలన చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్.మల్లేష్ మాట్లాడారు. ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు పడక పత్తి పంటలు వేసిన రైతులు ఒక్క ఎకరాకు 30 వేల నుంచి 35 వేల వరకు పెట్టుబడి పెట్టి పంట దిగుబడి రాక అప్పుల పాలు అయినారు. ప్రస్తుతము ఒక్క ఎకరా పత్తి పంట తీస్తే ఒక క్వింటాల్ నుంచి రెండు క్వింటాలు మాత్రమే వస్తుంది. ఈ రకంగా రైతు చాలా నష్టపోయినాడు కాంగ్రెస్ ప్రభుత్వం కరువులో రైతులను ఆదుకొని పంటలకు నష్టపరిహారం ఎకరాకు 25 వేల రూపాయలు చెల్లించాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నాము. ప్రభుత్వము ఆదుకోకపోతే అమ్రాబాద్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ఈనెల 25వ తారీకు నాడు రైతులందరి చేత పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతులు ఎం.వెంకటయ్య, కే.గోపాల్, కే.కృష్ణయ్య,ఆర్. కృష్ణయ్య,ఆర్.తిరుపతయ్య, ఏ. వెంకటయ్య, రెడ్డమూని పార్వతమ్మ, రెడ్డమ్మని తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.



చిలుకూరు పీహెచ్‌సీలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

సంప్రదాయాలకు పట్టం కట్టిన వైద్య సిబ్బంది

చిలుకూరు,మన ప్రజాపక్షం:
చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో బతుకమ్మ వేడుకలను వైద్య సిబ్బంది ఉత్సాహంగా నిర్వహించారు.సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డా. నిమ్మల సుభాష్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం ద్వారా మన సంస్కృతిని భావితరాలకు అందించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

ఇరిగేషన్ జిల్లా కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు


సూర్యాపేట,మన ప్రజాపక్షం:
తెలంగాణ పూల పండుగ బతుకమ్మ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని సూర్యాపేట జిల్లా ఇరిగేషన్ శాఖ సీఈ నాగభూషణం,ఎస్ఈ శ్రీనివాస్ లు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో టీజీవోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలను వారు ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణకు ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ ఆవశ్యకతను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేట బతుకమ్మ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని టీజీవోస్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా ఇరిగేషన్ కార్యాలయంలో ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులు ఆడుతూ పాడుతూ బతుకమ్మ ఆడి సందడి చేసి అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ యాదగిరి, సత్యనారాయణ, రామ్ కిషోర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి భూక్య పాండు నాయక్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ రమేష్, కిరణ్ కుమార్, శ్రీనివాస్, రవి కిషన్, గోవిందరాజులు, సుస్మిత, సునీత, సువర్ణరేఖ, రామకృష్ణ ,హరికృష్ణ, నవీకాంత్, మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ ధరావత్ స్వప్న, జాయింట్ సెక్రటరీ మల్సూర్, ఈసీ మెంబర్ ఉమామహేశ్వర్, ఏఈఈలు మమత, సుస్మిత,భవాని, హారిక, అధ్యక్షులు వెంకన్న, సీనియర్ అసిస్టెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీఐ చట్టం అమలులో రాష్ట్రస్థాయిలో ఉత్తమ జిల్లాగా సూర్యాపేటకు గుర్తింపు

కృషి చేసిన కలెక్టర్‌కు ఎస్పీ శుభాకాంక్షలు

సూర్యాపేట, మన ప్రజాపక్షం:
సమాచార హక్కు చట్టం-2005 అమలులో సూర్యాపేట జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాగా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా అవార్డు అందుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ను జిల్లా ఎస్పీ కె.నరసింహ బుధవారం రోజున కలక్టర్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు సమాచార హక్కు చట్టం అమలులో జిల్లా యంత్రాంగం కనబరిచిన పనితీరుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ నాయకత్వంలో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపి, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించడం, ప్రభుత్వ శాఖల పనితీరులో పారదర్శకతను పెంపొందించడం, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం వంటి అంశాల్లో జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సమర్థవంతమైన పరిపాలనలో జిల్లా యంత్రాంగం మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.



రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ అందించాలి

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నల్గొండ,మన ప్రజాపక్షం:
చిట్యాల మండలం వెలిమినేడు సబ్‌స్టేషన్ వద్ద రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో రైతు ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో గతంలో ఉన్న పరిస్థితులను మళ్లీ తీసుకొస్తామని చెప్పారని, ఇప్పుడు నిజంగానే రైతులకు విద్యుత్, సాగునీరు సక్రమంగా అందించలేని పరిస్థితులను తీసుకొచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వంటి విద్యుత్ ఉత్పత్తి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమవుతోందని ప్రశ్నించారు.విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతుల మోటార్లు, స్టార్టర్లు కాలిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ మళ్లీ రావాలి కాంగ్రెస్ ప్రభుత్వం పోవాలి అని రైతులు కోరుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించి, రైతును రాజుగా చేయాలనే లక్ష్యంతో పాలన సాగించారని గుర్తుచేశారు.ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు తమ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, రైతులను ఆదుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శించారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన నిర్లక్ష్య వైఖరిని విడనాడి రైతులకు సరిపడా నాణ్యమైన విద్యుత్, సాగునీరు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో రైతుల ఆగ్రహానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట, మన ప్రజాపక్షం:భూముల రీ సర్వే ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, జిల్లాలో పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వేకు సంబంధించి శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ, భూ సర్వే ప్రక్రియను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం చేపట్టాలని సూచించారు.జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు (డీటీలు), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు), గ్రామ పంచాయతీ అధికారులు (జీపీవోలు), సర్వేయర్లకు భూముల రీ సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రియాంక, భూముల రీ సర్వే నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలు, సర్వే ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంబంధిత రికార్డుల నిర్వహణ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించే అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.భూముల రీ సర్వే అనేది భూములకు సంబంధించిన వివరాలను కచ్చితంగా గుర్తించి, భూ రికార్డులను క్రమబద్ధీకరించడంలో కీలకమైన ప్రక్రియ అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సర్వే నిర్వహించే సమయంలో భూముల సరిహద్దులు, విస్తీర్ణం, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు, ఇతర సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.శిక్షణా కార్యక్రమంలో వివరించిన సాంకేతిక అంశాలు,విధివిధానాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో వాటిని ఆచరణలో పెట్టాలని కలెక్టర్ సూచించారు. సర్వే నిర్వహణలో ఎదురయ్యే సందేహాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి, తగిన మార్గదర్శకత్వంతో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో సమన్వయంతో పనిచేస్తూ, తమకు కేటాయించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు.రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తే రీ సర్వే ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షణను కేవలం అవగాహన కార్యక్రమంగా మాత్రమే పరిమితం చేయకుండా, అందులో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి, భూ సర్వేలో కచ్చితత్వం, పారదర్శకతను పాటించాలని ఆమె స్పష్టం చేశారు.భూముల రీ సర్వేకు సంబంధించిన ప్రతి దశను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రమేష్, సర్వే ల్యాండ్ ఏ.డీ. వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీ, క్రెడిట్ పంపిణీలో మరింత పురోగతి సాధించాలి

వెనుకబడిన మండలాలు, సీసీల పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలి

దసరాలోపు పంపిణీ, డేటా ఎంట్రీ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట,మన ప్రజాపక్షం:
స్త్రీనిధి రుణాల రికవరీ, క్రెడిట్ పంపిణీ, స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన లక్ష్యాల సాధనలో మరింత పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. వెనుకబడిన మండలాలు, తక్కువ పనితీరు కనబరుస్తున్న కమ్యూనిటీ కోఆర్డినేటర్ల (సీసీ) పనితీరును సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను లక్ష్యాల మేరకు అమలు చేయాలని సూచించారు.జిల్లాలో స్త్రీనిధి రుణాల రికవరీలో ప్రస్తుత పురోగతి సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, మరింత మెరుగుదలకు అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కొన్ని మండలాల్లో రికవరీ తక్కువగా ఉండటాన్ని గుర్తించి, సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. తక్కువ రికవరీ ఉన్న సంఘాలు, ప్రాంతాలను గుర్తించి లక్ష్యిత విధానంలో రికవరీ పెంచాలని సూచించారు. ప్రతి వారం మండలాల వారీగా పురోగతిని సమీక్షిస్తూ, ప్రతి నెలా సీసీల పనితీరును అంచనా వేయాలని ఆదేశించారు.పనితీరులో అధిక వ్యత్యాసాలు ఉన్న సీసీలు తమ పనితీరును విశ్లేషించుకుని మెరుగుపరచుకోవాలని సూచించారు. నిర్దేశిత సమయంలో పురోగతి సాధించని వారి పనితీరును తిరిగి సమీక్షించి, అవసరమైన చర్యలకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. రాబోయే మూడు నెలల్లో జిల్లాలో సాధ్యమైనంత ఎక్కువ రుణ రికవరీ సాధించేలా కృషి చేయాలని పేర్కొన్నారు.స్త్రీనిధి క్రెడిట్ పంపిణీలో సాధించిన పురోగతిని కొనసాగిస్తూ, అక్టోబర్ నెలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నెలవారీ, వార్షిక లక్ష్యాలను గడువులోగా సాధించాలన్నారు. ఇతర రుణాల పంపిణీకి సంబంధించిన అంశాల్లోనూ పురోగతి పెంచాలని ఆదేశించారు.దసరాలోపు పంపిణీ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడంతో పాటు, డేటా ఎంట్రీని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియను ఉన్నత స్థాయిలో పర్యవేక్షిస్తున్నందున అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.గ్రామాల్లో వీఓ భవనాల నిర్మాణానికి మంజూరైన ప్రతిపాదనలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా మంజూరైన భవనాల నిర్మాణ పనులను దసరా తర్వాత ప్రారంభించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. భవన నిర్మాణాలకు అవసరమైన భూములను గుర్తించి, సంబంధిత గ్రామపంచాయతీల తీర్మానాలతో ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు.భూముల గుర్తింపు, అనుమతులు, నిర్మాణ పనుల ప్రారంభంలో ఎలాంటి జాప్యం జరగకుండా ఏపీఎంలు, సీసీలు, సంబంధిత డీపీఎంలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. వచ్చే మార్చి నాటికి జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో వీఓ భవనాలు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.గోడౌన్లు, భవనాలు, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణాలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత అధికారులు నిర్మాణ పనుల ప్రారంభం, పురోగతి, పూర్తి స్థాయిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. రాబోయే ఒకటి నుంచి రెండు నెలల్లో పనుల్లో గణనీయమైన పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు.మండలాల వారీగా పనితీరును నెల రోజుల తర్వాత మరోసారి సమీక్షిస్తామని, అప్పటివరకు వెనుకబడిన ప్రాంతాలు, సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి వెంకట్ రాములు, ఎల్ డీ ఎం సురేష్ ఆత్రేయ, మున్సిపల్ కమిషనర్ శంకర్, జిల్లా మహిళా సమాఖ్య సభ్యురాలు, స్త్రీనిధి సిబ్బంది, ఏపీఎంలు, సీసీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎలినీనో ప్రభావంతో ఎండిపోతున్న పంటలు

నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి



నారాయణపేట, మన ప్రజాపక్షం:ఎలినీనో ప్రభావం వల్ల జిల్లాలో 11 శాతం లోటు వర్షపాతం నమోదైందని, దీనివల్ల రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి పెట్టుబడులు కోల్పోయి తీవ్ర ఆందోళనలో ఉన్నారని సిపిఎం నారాయణపేట ఏరియా కార్యదర్శి బండమీది బలరాం ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రోజున నారాయణపేట మండల పరిధిలోని బొమ్మన్‌పాడు గ్రామ శివారులో ఎండిపోయిన టమోటా, వంకాయ తోటలతో పాటు ఇతర పంట పొలాలను సిపిఎం బృందంతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండిపోయిన పంటలను చూపిస్తూ రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల అన్నదాతలు ఎంతో ఆశతో, అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి అంతా మట్టిపాలైందని అన్నారు. 11 శాతం వర్షపాత లోటు కారణంగా సాగునీరు అందక, చేతికొచ్చే దశలో పంటలు కండ్ల ముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని పేర్కొన్నారు. ఎకరాకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు.ఎండిపోయిన ఆహార ధాన్యాల పంటలకు ఎకరాకు రూ. 25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలనన్నారు.తీవ్రంగా నష్టపోయిన వాణిజ్య మరియు కూరగాయల పంటలకు (టమోటా, వంకాయ తదితర తోటలకు) ఎకరాకు రూ. 50,000 చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు.వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో ఎండిపోయిన పంట పొలాలను సర్వే చేసి నివేదికలు రూపొందించాలన్నారు.అప్పుల ఊబిలో ఉన్న రైతులు అధైర్యపడి ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడకుండా ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి రైతుల్లో భరోసా కల్పించాలి.రైతు భరోసా వెంటనే అందివ్వాలన్నారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో సిపిఎం బొమ్మన్‌పాడు గ్రామ నాయకులు అంతన్ గారి బాల్‌రామ్ ,కంకప్ప, వెంకటేష్,రాములు,నరసింహ,ఒగ్గు బాలప్ప తదితరులతో పాటు బాధిత రైతులు జనార్ధన్, బర్ల నాగప్ప, బస్వరాజ్, దానగాళ్ల నాగప్పలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కులపై పోరాటం ఆగదు..

హెల్త్ కార్డులు,రక్షణ చట్టం అమలు వరకు పోరాటం

టీఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ

టీఎంజేఎఫ్ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

జిల్లా అధ్యక్షుడిగా వంగూరు జయశంకర్



నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన భద్రత కోసం తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం (టీఎంజేఎఫ్) నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ స్పష్టం చేశారు.జర్నలిస్టులను అణిచివేయాలని చూస్తే హక్కుల కోసం పోరాడే కొత్త తరం మరింత బలంగా ముందుకొస్తుందని హెచ్చరించారు.నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని దేవకి ఫంక్షన్ హాల్ లో టీఎంజేఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పంగిడిచెరువు వెంకటేష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన టీఎంజేఎఫ్ జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని, అలాంటి జర్నలిస్టులకు వృత్తిపరమైన భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.విధి నిర్వహణలో జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాడులు, బెదిరింపుల నుంచి రక్షణ కల్పించేందుకు సమగ్ర జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రక్షణ చట్టం అమలయ్యే వరకు టీఎంజేఎఫ్ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు.ప్రతి జర్నలిస్టుకూ ఆరోగ్య భద్రత కల్పించాలని అన్నారు.అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ హెల్త్ కార్డులు మంజూరు చేసి, వారికి, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో టీఎంజేఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడిగా వంగూరు జయశంకర్,ఉపాధ్యక్షులుగా సౌటా రాములు, ఎర్రవల్లి శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శిగా డి. రామస్వామి,కోశాధికారిగా కావలి పరశురాములు,ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గిద్ద విజయ్ కుమార్, సి.సుందర్ లను ఎన్నుకున్నారు.నూతన కమిటీ సభ్యులకు బూర్గుల నాగేందర్ అభినందనలు తెలిపారు.జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి,అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో టీఎంజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబ్బ నాగేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లె రాజన్న,జంగయ్య,భాస్కర్,సుధాకర్ తో పాటు వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలి

నైట్ పెట్రోలింగ్‌లో ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ వద్ద నిరంతర తనిఖీలు

బ్యాంకు అధికారులతో సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్ సూచనలు

సూర్యాపేట, మన ప్రజాపక్షం:
సూర్యాపేట జిల్లా లోని బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలు సహా ఆర్థిక లావాదేవీలు నిర్వహించే ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ వద్ద భద్రతను మరింత బలోపేతం చేయాలని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్ నందు పట్టణంలోని వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశం నిర్వహించి, బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. ప్రజలు తమ కష్టార్జిత సొమ్మును భద్రపరుచుకునే బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత కల్పించడం ఎంతో ముఖ్యమని డీఎస్పీ పేర్కొన్నారు. ఖాతాదారుల నగదు, ఆస్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బ్యాంకు అధికారులు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ నేరగాళ్లు ఏటీఎం కేంద్రాల్లో, బ్యాంక్ ల్లో చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రత్యేక పరికరాలతో కూడిన కిట్లను చిన్న సూట్‌కేసుల్లో తీసుకువచ్చి, సాధారణ వ్యక్తులుగా ఏటీఎం కేంద్రాల్లోకి, బ్యాంక్ లోకి ప్రవేశించి, అతి తక్కువ సమయంలో ఏటీఎంలను ధ్వంసం చేసి నగదును అపహరిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల్లో నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద కదలికలు గుర్తించినప్పుడు వెంటనే అప్రమత్తం చేసేలా అలారం



వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. బ్యాంకుల్లోకి అపరిచితులు లేదా అనుమానాస్పద వ్యక్తులు ప్రవేశించినప్పుడు, ఆయుధాలతో ఎవరైనా వచ్చినప్పుడు తక్షణమే పోలీసులకు సమాచారం అందేలా సమర్థవంతమైన సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. బ్యాంకుల వద్ద అనుమానాస్పద శబ్దాలు, కదలికలు లేదా ఇతర అసాధారణ పరిస్థితులు గుర్తించిన వెంటనే బ్యాంకు అధికారులకు, స్థానిక పోలీసులకు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నైట్ పెట్రోలింగ్‌లో ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ వద్ద తనిఖీలు

పోలీసు శాఖ రాత్రి గస్తీలో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోందని డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. నైట్ పెట్రోలింగ్‌లో భాగంగా బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలు తదితర ప్రతి ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ వద్ద భద్రతా పరిస్థితులను పర్యవేక్షిస్తూ, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా సంస్థల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతారని తెలిపారు. బ్యాంకు అధికారులు కూడా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. రాత్రివేళ బ్యాంకుల వద్ద అవసరమైన భద్రతా సిబ్బంది అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, సెక్యూరిటీ సిబ్బందికి బ్యాంకు అధికారుల ఫోన్ నంబర్లతో పాటు స్థానిక పోలీసుల సంప్రదింపు నంబర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. సీసీ కెమెరాలు, అలారం వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు.

నగదు రవాణా సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు

బ్యాంకుల నుంచి ఏటీఎం కేంద్రాలకు, ఇతర బ్యాంకులకు నగదును తరలించే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. నగదు రవాణాకు ముందు బ్యాంకు పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు ఉన్నారేమో గమనించాలని, నగదు తరలింపు సమయంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. బ్యాంకు అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది, స్థానిక పోలీసులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అనుమానాస్పద వ్యక్తులు, కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించాలి

సైబర్ నేరాల నివారణకు బ్యాంకు అధికారులు ఖాతాదారులకు అవగాహన కల్పించాలని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ సూచించారు. అత్యాశ, అవగాహన లోపంతో ప్రజలు సైబర్ మోసాలకు గురవుతున్నారని తెలిపారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు వివరాలు, పిన్ నంబర్లు అపరిచితులకు వెల్లడించవద్దని సూచించారు.బ్యాంకుల్లో అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేసి, ఖాతాదారులకు తరచూ సూచనలు ఇవ్వాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎస్ఐలు కనకరత్నం, రహిముద్దిన్, పట్టణంలోని వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ సంఘీభావం

నాగర్‌కర్నూల్,మన ప్రజాపక్షం:
జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసంజేఏసీ నాగర్‌కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని సందర్శించిన బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా డాక్టర్ కొప్పుల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వైద్య, ఆరోగ్య రంగంలో సేవలందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల సేవలను గుర్తించి వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, అర్హులైన కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.ఎన్ హెచ్ ఎం పరిధిలో పనిచేస్తున్న అర్హులైన కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగులకు నిరంతర ఉద్యోగ భద్రత కల్పించి, అన్యాయమైన తొలగింపులను నివారించాలని, ఉద్యోగుల బాధ్యతలు, విధులకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని,ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వేతనాలను పెంచి, ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు వర్తించే నిబంధనల ప్రకారం సర్వీసు ప్రయోజనాలు కల్పించాలని,ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చలు జరిపి తగిన నిర్ణయాలు తీసుకోవాలని డాక్టర్ కొప్పుల రాజశేఖర్ కోరారు. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని పేర్కొంటూ, సమ్మె చేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు తన సంఘీభావాన్ని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గౌస్ పాషా, అడిషనల్ జనరల్ సెక్రెటరీ కల్పన,ఎన్ హెచ్ ఎం జేఏసీ ప్రెసిడెంట్ డాక్టర్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్, హైమావతి, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, డాక్టర్ మహతి, జేఏసీ సభ్యులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రాజు, డాక్టర్ సాయి మణికంఠ, డాక్టర్ జగన్, మహిళా విభాగం ప్రెసిడెంట్ రజియా తదితరులు పాల్గొన్నారు.ఎన్హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు?

రైతుల కష్టాలు రేవంత్ రెడ్డికి కనిపించడం లేదా?

రైతుల మహాధర్నాకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మద్దతు

తిమ్మాజిపేట మండల కేంద్రంలో విద్యుత్ సమస్యపై రైతుల ఆందోళన

పంటలు ఎండిపోతున్నా స్పందించని ప్రభుత్వంపై తీవ్ర నిరసన

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని తిమ్మాజిపేట మండలంలో విద్యుత్ సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మండల కేంద్రంలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? రేవంత్ రెడ్డి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.ఎన్నికల సమయంలో రైతులకు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడంలో ఎందుకు విఫలమవుతోందని ప్రశ్నించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని నిలదీశారు. ఒకవైపు రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెబుతూ, మరోవైపు విద్యుత్ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలకు, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు.రైతులు అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తున్నారు. పంటలకు నీరు అందించాల్సిన కీలక సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులు నెలల తరబడి పడిన కష్టం, పెట్టిన పెట్టుబడి వృథా అయ్యే పరిస్థితి ఏర్పడితే ఆ నష్టాన్ని ఎవరు భరిస్తారు?రైతులకు సమయానికి విద్యుత్ అందించడం



ప్రభుత్వ బాధ్యత కాదా? పంటలు ఎండిపోయిన తర్వాత స్పందిస్తారా? రైతులు నష్టపోయిన తర్వాత పరిహారం ప్రకటిస్తారా? పంటలు దెబ్బతినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు.రైతుల సమస్యలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరాను పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.తిమ్మాజిపేట మండల రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ మహాధర్నా చేపట్టాల్సిన పరిస్థితి రావడం ఆందోళనకరమని మర్రి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ అందించాల్సిన సమయంలో వారు రోడ్డుపైకి వచ్చి నిరసన తెలియజేయాల్సి రావడం ప్రభుత్వ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ ప్రకటనలను పక్కనపెట్టి రైతుల సమస్యలపై దృష్టి సారించాలని, విద్యుత్ శాఖ అధికారులు తిమ్మాజిపేట మండలంలో నెలకొన్న సమస్యలను వెంటనే సమీక్షించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలి. విద్యుత్ కోతలు, సరఫరాలో అంతరాయాల వల్ల పంటలకు నష్టం వాటిల్లకుండా తక్షణ చర్యలు చేపట్టాలి. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. రైతుల ఆవేదనను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదు.కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా విధానాన్ని అమలు చేశామని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులకు నిరంతర విద్యుత్ అందించాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేదని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల సమస్యలపై తక్షణమే స్పందించి, తిమ్మాజిపేట మండల రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోకపోతే వారి పక్షాన నిలబడి ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

సిరాజ్ కెప్టెన్సీ అదుర్స్..

రంజీ ట్రోఫీలో గెలుపు బోణీ కొట్టిన హైదరాబాద్ టీమ్



రంజీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ సారథ్యంలో బరిలోకి దిగిన హైదరాబాద్.. గ్రూప్-బి తొలి మ్యాచ్‌లో త్రిపురపై ఇన్నింగ్స్ 40 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. కేవలం మూడు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు.హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన త్రిపుర, హైదరాబాద్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులకే కుప్పకూలింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అనికేత్ రెడ్డి 5 వికెట్లతో చెలరేగగా, తనయ్ త్యాగరాజన్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్, ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (54), రుతిక్ యాదవ్ (61), రాహుల్ రదేశ్ (40), చామ మిలింద్ (40) రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 294 పరుగులు చేసి కీలక ఆధిక్యాన్ని సంపాదించింది.రెండో ఇన్నింగ్స్‌లోనూ త్రిపుర బ్యాటర్లు చేతులెత్తేశారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ ఈసారి 6 వికెట్లతో త్రిపుర పతనాన్ని శాసించాడు. కెప్టెన్ సిరాజ్ రెండు కీలక వికెట్లు తీయడంతో త్రిపుర 120 పరుగులకే ఆలౌటైంది. దీంతో హైదరాబాద్ జట్టు ఇన్నింగ్స్ 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మ్యాచ్ మొత్తంలో 9 వికెట్లు తీసిన తనయ్ త్యాగరాజన్ హీరోగా నిలిచాడు.

యూపీ, ముంబై జట్ల భారీ విజయాలు

ఇదిలా ఉండగా, ఇతర గ్రూప్ మ్యాచ్‌లలో ఉత్తరప్రదేశ్, ముంబై జట్లు సైతం భారీ ఇన్నింగ్స్ విజయాలను తమ ఖాతాలో వేసుకున్నాయి. రాజ్‌గిర్‌లో జరిగిన మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్.. బీహార్‌పై ఇన్నింగ్స్ 267 పరుగుల తేడాతో గెలిచింది. యూపీ తొలి ఇన్నింగ్స్‌లో 540 పరుగులు చేయగా, మాధవ్ కౌశిక్ (150), రింకూ సింగ్ (112) శతకాలతో కదం తొక్కారు. బీహార్ రెండు ఇన్నింగ్స్‌లలో 141, 132 పరుగులకే ఆలౌటైంది.మరోవైపు, వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ముంబై.. చండీగఢ్‌పై ఇన్నింగ్స్ 155 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ముంబై బౌలర్ తుషార్ దేశ్‌పాండే హ్యాట్రిక్‌తో పాటు తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల ప్రదర్శనతో చండీగఢ్ పతనాన్ని శాసించాడు. ఈ ప్రదర్శనతో చండీగఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 78 పరుగులకే కుప్పకూలింది. ఫాలో ఆన్‌లోనూ రాణించలేక 196 పరుగులకు ఆలౌటై ఓటమిపాలైంది.